సాక్షి సంగారెడ్డి

సోమవారం । 3 । ఫిబ్రవరి । 2025



ఇళ్లు, రోడకూ రైతుభరోసా

హుస్నాబాద్ మండలంలో అధికారులు తప్పుడు సర్వేలు చేసి ఇళ్లు, రోడ్లకు కూడా రైతుభరోసా వచ్చేలా చేశారు.

వివరాలు 8లో ▸



వ్యక్తి దారుణహత్య

వ్యక్తి దారుణహత్యకు గురైన సంఘటన నర్సాపూర్ మండల పరిధిలోని టిక్యా దేవమ్మ గూడెం పంచాయతీ పరిధి సామ్య తండాలో జరిగింది.

వివరాలు 8లో ▸



భక్తుల కొంగుబంగారం

దుబ్బాక పట్టణంలోని మహంకాళమ్మ ఆలయం ఎనిమిదవ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

మార్కెటింగ్ అవకాశం కల్పించాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి



స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి జోన్: మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల మార్కెటింగ్‌కు తగినన్ని అవకాశాలను కల్పించాలని అధికారులకు కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. మహిళా సాధికారతను పెంపొందించడంలో భాగంగా గ్రామీణాభివృద్ధి సంస్థ రంగారెడ్డి జిల్లా కన్హ శాంతి వనం ఆదిశక్తి మహోత్సవ ధ్యాన కేంద్రంలో మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన అమ్మక కేంద్రాలను ఏర్పాటు చేసింది. సంగారెడ్డి జిల్లా తరఫున మూడు స్టాళ్లను (గుమ్మడిదల, అమీనాపూర్, కోహిర్) పెట్టారు. ఈ స్టాళ్లలో ఆర్గానిక్ ఫుడ్స్, హస్తకళ ఉత్పత్తులు, సహజ సామగ్రి వంటి అనేక ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ స్టాళ్లను కలెక్టర్ క్రాంతి ఆదివారం సందర్శించి ఆయా ఉత్పత్తులను పరిశీలించారు. డ్వాక్రా మహిళలతో మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...గ్రామీణ మహిళలు స్వయం ఉపాధిని పెంచుకోవడానికి స్వయం సహాయక సంఘాలకు వేదిక లభించిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని మరింతగా ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సరస్వతీ పూజలో ఎమ్మెల్యే గూడెం



ఎమ్మెల్యే గూడెంకు జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు

పటాన్‌చెరు: వసంత పంచమిని పురస్కరించుకుని బెంగాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పటాన్‌చెరు పట్టణంలోని బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సరస్వతీదేవి పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పాతికేళ్లుగా స్థానిక బెంగాలీలు వసంత పంచమి రోజు సరస్వతీదేవి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను నిర్వాహకులు సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే విజయం మీ వెంటే

మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

పటాన్‌చెరు: ప్రతీ విద్యార్థి ఇష్టపడి చదివితే విజయం మీ వెంటే వస్తుందని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విద్యార్థులకు హితబోధ చేశారు. పటేల్‌గూడలో ఆదివారం ఐఐటీ చుక్కా రామయ్య ఇష్టా జూనియర్ కళాశాల ఫేర్‌వెల్ డే వేడుకలకు ఐఐటీ ప్రొఫెసర్ హిమబిందుతో కలసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ...తల్లిదండ్రులు ఎంతో కష్టపడి తమ పిల్లల్ని చదివిస్తున్నారని వారు కూడా అంతే బాధ్యతగా చదువుకుని ఉన్నతస్థానాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఐఐటీ చుక్కారామయ్య ఇష్టా విద్యాసంస్థల చైర్మన్ కార్తీక్ కోట, డైరెక్టర్ వినోద్ కుమార్, అకడమిక్ డీన్ ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాల్ దీప, సంగారెడ్డి బ్రాంచ్ ప్రిన్సిపాల్ రవికిరణ్‌రెడ్డి, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఆరా

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీలో ఆదివారం ప్రత్యేక అధికారి ఫాల్గుణ్ కుమార్ పర్యటించారు. నగర పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. అంతర్గత మురికి కాలువలు, రోడ్లు వంటి నిర్మాణ పనులను త్వరగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఆర్‌వో నర్సింలు సిబ్బంది పాల్గొన్నారు.

సంగమేశ్వర, బసవేశ్వరలకు మోక్షం!

- మౌఖికంగా ఆదేశాలిచ్చిన ప్రభుత్వం
- భూ సేకరణలో వేగం పెంచనున్న అధికారులు!



సంగమేశ్వర, బసవేశ్వర పథకాలకు శంకుస్థాపన చేస్తున్న నాటి సీఎం కేసీఆర్ (ఫైల్)

జహీరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులు నిలిచిపోయిన సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలకు మోక్షం కలగనుందా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఎందుకంటే ఇటీవలే ఈ రెండు ఎత్తిపోతల పథకాల పనులను మొదలుపెట్టేందుకు ప్రభుత్వం ఇప్పటికే మౌఖిక ఆదేశాలిచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని అధికారయంత్రాంగం సైతం ధ్రువీకరిస్తోంది. త్వరలోనే భూ సేకరణ పనులను చేపట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇందులో భాగంగా ముందుగా వివాదం లేని భూములను సేకరించనున్నారు.

2.19లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యంగా..

సంగమేశ్వర ఎత్తిపోతల పథకానికి గాను 6,293 ఎకరాల భూమి అవసరం అవు తుందని, రూ.2,653 కోట్ల మేర నిధులు అవసరం అవుతాయని అంచనా వేశారు. జహీరాబాద్, అందోల్, సంగారెడ్డి నియోజకవర్గాల్లోని 11 మండలాలకు చెందిన 231 గ్రామాల్లోని 2.19 లక్షల ఎకరాలకు సాగు నీటిని అందించేందుకు ఈ పథకాన్ని రూపొందించారు.

రూ.4,500కోట్ల అంచనా వ్యయం

నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూపొందించిన మ్యాప్‌లో కొన్నింటికి మార్పులు చేసి పథకానికి రూపకల్పన చేయనున్నట్లు తెలుస్తోంది. 2021లో ఆయా ప్రాజెక్టులకు అనుమతులు లభించాయి. 21 ఫిబ్రవరి 2022లో నారాయణఖేడ్‌లో అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఈ రెండు ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన చేశారు. ఆయా పథకాలకుగాను రూ.4,500 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి సింగూరుకు నీటిని మళ్లించి 20టీఎంసీల వినియోగంతో 3.84లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రెండు ఎత్తిపోతల పథకాలను గత ప్రభుత్వం చేపట్టింది.

ఖేడ్ నియోజకవర్గంలో సాగునీటికి బసవేశ్వర..

నారాయణఖేడ్ నియోజకవర్గానికి సాగు నీటిని అందించేందుకుగాను బసవేశ్వర ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారు. ఈ పథకం కింద 8 టీఎంసీల నీటితో 1,65లక్షల ఎకరాలకు నీటిని అందించాలని ప్రతిపాదించారు. ఇందుకోసం రూ.1,774కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. 14 జూన్ 2021లో సంగమేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి సంబంధించి కంకోల్‌లో సంప్‌హౌజ్, 21 జూన్ బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి సంబంధించిన సంప్‌హౌజ్ నిర్మాణానికి, అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఆయా పథకాలకు గ్రహణం పట్టింది.

కేసీఆర్ హెచ్చరికలతో చలనం..

ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం ఆయా ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లాలనే యోచనతో ఉండటంతోనే భూ సేకరణ కోసం నీటిపారుదల శాఖ కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయా ప్రాజెక్టుల విషయంలో శుక్రవారం ఎర్రవల్లిలోని తన ఫాంహౌజ్‌లో జహీరాబాద్ ప్రాంత నేతల సమావేశంలో ప్రభుత్వాన్ని నిలదీసిన సంగతి తెలిసిందే. అవసరమైతే ఉద్యమాన్ని చేపట్టి ఆయా ప్రాజెక్టులను సాధిస్తానని ప్రభుత్వానికి హెచ్చరికలు సైతం జారీ చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయా ప్రాజెక్టులను చేపట్టే అవకాశం ఉందనే అభిప్రాయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

వసంత పంచమికి పంచవటి ముస్తాబు



ఉత్సవాలకు ముస్తాబైన పంచవటి క్షేత్రం

నేడు అష్టాదశ శక్తి పీఠాల విగ్రహ ప్రతిష్ఠాపన

- ఉత్సవాలకు హాజరుకానున్న ప్రముఖులు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆశ్రమ పీఠాధిపతి కాశీనాథ్ బాబా



క్షేత్రంలో వెలసిన శారదాదేవి

న్యాల్‌కల్(జహీరాబాద్): మంజీర నది సమీపంలో పంచవటి క్షేత్రంలో వెలసిన శ్రీ శారదాలయం వసంత పంచమి ఉత్సవాలకు ముస్తాబైంది. న్యాల్‌కల్ మండల పరిధిలోని రాఘవాపూర్–హుమ్నాపూర్ గ్రామాల శివారులో రెండో బాసరగా విరాజిల్లుతున్న ఈ ఆలయంలో ఈ నెల 3 నుంచి 4వ తేదీ వరకు రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ మేరకు ఆశ్రమ పీఠాధిపతి కాశీనాథ్ బాబా వెల్లడించారు. పంచవటి క్షేత్రంలో శారదాదేవితోపాటు సాయిబాబా, సూర్యభగవాన్ ఆలయాలు, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి విగ్రహాలతోపాటు జ్యోతిర్లింగాలు కూడా ఉన్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 3న మహాగంగ పూజ, బోనాల ఊరేగింపు, సామూహిక అక్షరాభ్యాసం, అమ్మవారికి అభిషేకాలు, సరస్వతీయాగం, అష్టాదశ శక్తి పీఠాల విగ్రహ ప్రతిష్ఠాపన, 4న ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, డోలోత్సవం, వెంకటేశ్వరస్వామి కల్యాణం, రథసప్తమి, రథోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

63 గ్రామాలనుంచి మహిళా భక్తుల రాక

ఈ నెల 3న నిర్వహించే వసంత పంచమికి మండలంలోని రాఘవాపూర్, చాల్కి, కాకిజన్‌వాడ, చీకూర్తి, అమీరాబాద్, ఇబ్రహీంపూర్, హుమ్నాపూర్, రేజింతల్ గ్రామాలతోపాటు రాయికోడ్, మనూర్, నారాయణఖేడ్, అల్లాదుర్గం, జోగిపేట్ తదితర మండలాల పరిధిలోని 63 గ్రామాల మహిళలు బోనాలతో వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుంటారు. ఆయా గ్రామాల నుంచి తరలి వచ్చే మహిళలు ఒకే రకమైన వస్త్రాలను ధరించడం ప్రత్యేకతను సంతరించుకుంటుంది. ఆ రోజు ఉదయం ప్రధాన రోడ్లు మహిళాభక్తులతో కిటకిటలాడుతాయి. రాత్రి ఆలయంలో భజన కార్యక్రమాలతోపాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయి. ఆలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన హోమాలలో దంపతులు పాల్గొని తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అష్టాదశ శక్తి పీఠాల విగ్రహ ప్రతిష్ఠాపన, పూర్ణాహుతి కార్యక్రమాలు సోమవారం నిర్వహించనున్నారు.

ప్రముఖుల రాక

ఈ ఉత్సవాలకు మంత్రి దామోదర రాజనర్సింహ, జహీరాబాద్ ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్, జహీరాబాద్, నారాయణఖేడ్, నర్సాపూర్ ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, సంజీవరెడ్డి, సునీతారెడ్డితోపాటు పీఠాధిపతులు శివకుమార్ స్వామి, సోమలింగ శివాచార్య మహాస్వామిజీ, రాగ్య శిఖామణి శ్రీ అవదూతగిరి మహరాజ్, వీరేశ్వర శివాచార్య స్వామి, గణపతి మహరాజ్, రాచయ్య స్వామి తదితరులు హాజరుకానున్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్



సంగారెడ్డిలోని బాలుర కళాశాలలో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు(ఫైల్)

- ఈ నెల 20 వరకు ప్రయోగ పరీక్షలు
- తొలిసారి సీసీ కెమెరాల పర్యవేక్షణలో...
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఇంటర్ విద్యాశాఖ

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 3 నుంచి 20వ తేదీ వరకు ప్రయోగ పరీక్షలు జరగనున్నాయి. ఈ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఇంటర్ విద్యాశాఖ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. మాస్ కాపీయింగ్‌ను అరికట్టడంలో భాగంగా ఈసారి గతంలో ఎన్నడూలేని విధంగా ప్రాక్టికల్ పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించనున్నారు. ప్రైవేట్ కళాశాలలో విద్యార్థులకు ప్రాక్టికల్స్‌లో అత్యధిక మార్కులు వస్తున్నాయనే ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. ఈ సీసీ కెమెరాలను ఎగ్జామ్ బోర్డుకు అనుసంధానం చేశారు. పరీక్షలు నిర్వహించే తీరును అధికారులు ఇక్కడి నుంచే పర్యవేక్షించనున్నారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడినట్లు గుర్తిస్తే సంబంధిత కళాశాలల యాజమాన్యం చర్యలు తీసుకుంటారు.

ప్రతీ కళాశాలలో రెండు సీసీ కెమెరాలు

జిల్లాలో 20 ప్రభుత్వ కళాశాలలుండగా, 48 ప్రైవేట్, 63 ప్రభుత్వ రెసిడెన్షియల్ కళాశాలలున్నాయి. వీటిలో సుమారు 10 వేలమంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రాక్టికల్ పరీక్షల నేపథ్యంలో ప్రభుత్వ కళాశాలల్లో రెండు సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రభుత్వం రూ.12 వేలు విడుదల చేసింది. దీంతో ప్రతీ కళాశాలలో రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ రెండు కెమెరాలలో ఒకటి ల్యాబ్ లోపల, మరో కెమెరాను ప్రవేశద్వారం దగ్గర ఏర్పాటు చేశారు. దీంతో ప్రయోగ పరీక్షల జరిగే సమయంలో వీడియోతోపాటు ఆడియో కూడా రికార్డవుతుంది.

ప్రశ్న పత్రాలు ఆన్‌లైన్‌లో...

ప్రాక్టికల్స్‌కు సంబంధించిన ప్రశ్న పత్రాలను ఏరోజుకారోజు ఇంటర్‌బోర్డు ఆన్‌లైన్‌లో పొందుపరచనుంది. ఈ ప్రశ్న పత్రాలకు సంబంధించి అరగంట ముందుగానే కళాశాల ప్రిన్సిపాల్ లాగిన్‌కు మెయిల్ వస్తుంది. దాని ప్రకారం ప్రశ్న పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఆ ప్రింట్ తీసుకున్న ప్రశ్న పత్రాన్ని విద్యార్థులకు అందజేస్తారు. ప్రశ్న పత్రాలను మాత్రమే సీసీ కెమెరా పర్యవేక్షణలో ఓపెన్ చేసేవారు. కాగా, ఈ ఏడాది ప్రయోగాలను కూడా సీసీ కెమెరాల పర్యవేక్షణలో చేయాల్సి ఉంటుంది.

అన్ని ఏర్పాట్లు పూర్తి



"ప్రయోగ పరీక్షలకు సంబంధించి కళాశాలల్లో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం. మాస్ కాపీయింగ్‌కు పాల్పడే అవకాశం లేకుండా ప్రతీ ప్రభుత్వ కళాశాలలో రెండు సీసీ కెమెరాలను అమర్చాం. తప్పనిసరిగా సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే విద్యార్థులు ప్రయోగాలు చేయాలి. –గోవిందరాం, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి"

జాతర్లతో ఆధ్యాత్మిక వాతావరణం

మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్

పటాన్‌చెరు టౌన్: జాతర్ల నిర్వహణతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం చోటు చేసుకుంటుందని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల గ్రామ పరిధిలో ఆదివారం భ్రమరాంబిక సహిత మల్లికార్జున (గుండు మల్లన్న) జాతర మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు తలసానిని ఘనంగా సన్మానించారు. మల్లన్న దేవాలయం వద్ద నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని మాజీమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మల్లన్న ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నానన్నారు. మల్లన్న స్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నాగేష్, జాతర నిర్వాహకులు శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణపై కేంద్రం వివక్ష

టీపీసీసీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి హకీం



మాట్లాడుతున్న హకీం

హత్నూర(సంగారెడ్డి): తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని, తాజా బడ్జెట్లో రాష్ట్రాన్ని మళ్లీ మోసం చేసిందని టీపీసీసీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎంఏ హకీం విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి నిరసనగా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు. హత్నూర మండలం దౌల్తాబాద్‌లో ఆదివారం విలేకరులతో హకీం మాట్లాడుతూ...కేంద్రం లక్షల కోట్లు బడ్జెట్ ప్రకటించినప్పటికీ తెలంగాణకు మాత్రం మొండిచెయ్యి చూపిందన్నారు. విభజన చట్టంలో రావలసిన నిధులనైనా కనీసం కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బయ్యారం స్టీల్ ప్లాంట్,హైదరాబాద్ నాగపూర్ కారిడార్, మెగా లెదర్ పార్క్, మెట్రో రైలు రెండో దశకు నిధులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, ప్రత్యేక నిధుల కేటాయింపులో వివక్ష చూపిందని మండిపడ్డారు. తెలంగాణ నుంచి బీజేపీకి చెందిన ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండికూడా రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రసాద్, మొహమ్మద్ రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

కంది.. కొనరేంది?

- ఏర్పాటుకాని కొనుగోళ్ల కేంద్రాలు
- పంటంతా దళారుల పరం
- దిగుబడులు వచ్చి 20 రోజులు గడుస్తున్నా చర్యలు శూన్యం
- విధిలేక ప్రైవేటు వ్యాపారులకు విక్రయం
- క్వింటాలుకు రూ.వెయ్యికిపైగా నష్టపోతున్న రైతులు



నారాయణఖేడ్ పట్టణంలో కంది కొనుగోలు కేంద్రం

నారాయణఖేడ్: జిల్లాలో కంది రైతుల గోస ఎవరికీ పట్టడంలేదు. దిగుబడులు వచ్చి సుమారు ఇరవై రోజులవుతున్నా కొనుగోళ్ల కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో చేసేదిలేక దళారులకు విక్రయిస్తున్నారు. దీంతో క్వింటాలుకు రూ.వెయ్యికిపైగా నష్టపోతున్నారు. మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు జిల్లాలో అవసరమైన మేర కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిందిగా ప్రభుత్వం మార్క్‌ఫెడ్ అధికారులకు ఆదేశించింది. పంట దిగుబడులు ప్రారంభమై 20రోజులకుపైగా అవుతున్నా కేంద్రాల ఏర్పాటులో తీవ్ర తాత్సారం జరుగుతోంది. అధికారులు నిర్లిప్తత కారణంగా దళారులు భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలో 10 కేంద్రాలను ఏర్పాటు చేస్తామని అధికారులు ప్రభుత్వానికి నివేదించినా ఇప్పటివరకు ఐదు కేంద్రాలనే ఏర్పాటు చేశారు.

అనువుగాని చోట కేంద్రాలు!

రైతులకు అనువుగా ఉండే ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఆ దిశగా అధికారుల చర్యలు సాగడంలేదు. ఇప్పటివరకు జహీరాబాద్ ప్రాంతంలోని సత్వార్, ఏడాకులపల్లి, కంగ్టి, ఝరాసంగం, సదాశివపేటల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. పాత కల్హేర్ మండలం బాచేపల్లి, నాగల్‌గిద్ద, మునిపల్లి మండలం చెల్మడ, వట్‌పల్లి పరిధిలోని ఖాదీరాబాద్‌లలో కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపినా ఇంతవరకు ఏర్పాటు కాలేదు. అధికారులు కేంద్రాల పంట దిగుబడుల ఆధారంగా కాకుండా ఎక్కడో ఒకచోట ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కల్హేర్ మండలంలో కంది పంట సాగు కేవలం 244 ఎకరాల్లోనే సాగయ్యింది. ఈ మండలంలో కేంద్రం ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నా ఉత్పత్తి అనుకున్న మేర లేని చోట్ల ఏర్పాటు చేసినా ప్రయోజనం శూన్యం. ఖేడ్ మండలంలో 3,608 ఎకరాల్లో, నాగల్‌గిద్దలో 9,393, మనూరులో 2,058, సిర్గాపూర్‌లో 2,777, నిజాంపేట్ మండలంలో 80 ఎకరాల్లో సాగు చేశారు. ఖేడ్ మండలం ఖేడ్, సిర్గాపూర్, నిజాంపేట్, మనూరు, నాగల్‌గిద్ద మండలాల్లోని చాలా గ్రామాలకు కేంద్రంగా ఉంటుంది. కానీ ఖేడ్‌లో కేంద్రం ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఖేడ్‌లో మార్క్‌ఫెడ్ లేదా, డీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తే రైతులకు ప్రయోజనం ఉంటుంది. జిల్లాలో 77,110 ఎకరాల్లో కంది పంట సాగు జరిగింది. అత్యధికంగా నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్ నియోజకవర్గాల్లో సాగు ఉంటుంది. అధికంగా సాగు జరిగిన మండలాల్లో, రైతులకు అనువైన ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటు చేస్తే ప్రయోజనం చేకూరుతుంది.

దళారులకే విక్రయం

ఖేడ్ పట్టణంలో పలువురు వ్యాపారులు దళారుల అవతారం ఎత్తి కందుల కొనుగోళ్లు ముమ్మరం చేశారు. ఐదారు ప్రాంతాల్లో దుకాణాలు తెరచి క్వింటాలుకు రూ.6,500 నుంచి రూ.6,700 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.7,550 చెల్లిస్తోంది. కేంద్రాలు పూర్తి స్థాయిలో తెరవకపోవడంతో క్వింటాలుకు రూ. వెయ్యి వరకు నష్టపోతున్నారు. దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేయడమేకాక తూకంలోనూ మోసం చేస్తున్నారు.

ఏర్పాటు చేస్తాం

"రైతులకు అనువుగా ఉండే ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. డీసీఎంఎస్ వారికి కేంద్రాలు తెరవాలని సూచించాం. దళారులకు రైతులు అమ్ముకోవద్దు. ప్రభుత్వం ఏర్పాటు చేసే కేంద్రాల్లోనే విక్రయించాలి.

– శ్రీదేవి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు, సంగారెడ్డి"

కార్మికులను మోసం చేసిన కేంద్రం

సీపీఐ జిల్లా కార్యదర్శి తాజోద్దీన్ ధ్వజం



సదాశివపేట(సంగారెడ్డి): వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో కార్మికులు, కర్షకులు, పేదలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం దగా చేసిందని సీపీఐ జిల్లా కార్యదర్శి తాజోద్దీన్ విమర్శించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ... వేతన జీవులకు ఊరట కల్పిస్తున్నామని చెప్పి కేంద్రం పేదలను దారుణంగా మోసం చేసిందన్నారు. దేశాన్ని అదానీ, అంబానీకి తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీ కేంద్రమంత్రులు ఇద్దరున్నా రాష్ట్రాభివృద్ధికి ఎలాంటి నిధులు రాబట్టలేనందున కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు తమ పదవులకు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రామిక కార్యదర్శి అనసూజ, మహిళా నాయకులు బుజ్జమ్మ, ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాయపోల్ విద్యార్థినికి గోల్డ్ మెడల్


గోల్డ్ మెడల్ అందుకుంటున్న మానస

దుబ్బాకటౌన్: బీటెక్ ఫుడ్ టెక్నాలజీలో రాయపోల్‌కు చెందిన విద్యార్థి గల్వ మానస గ్రాడ్యుయేట్ పట్టాతో పాటు గోల్డ్ మెడల్ సాధించి ప్రశంసలు అందుకుంది. చెన్నైలోని మధురై కళాసాలింగం యూనివర్శిటీ 37వ స్నాతకోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో యూనివర్శిటీ వీసీ చేతుల మీదుగా పట్టా, గోల్డ్ మెడల్‌ను అందుకుంది. దీంతో ఆమెను పలువురు అభినందించారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత


తప్పిపోయిన బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న పోలీసులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి తల్లిదండ్రులతో వచ్చి తప్పిపోయిన ఓ బాలుడిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ మండలం చాగల్లు గ్రామానికి చెందిన ప్రవీణ్ తన కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చారు. ఈ క్రమంలో తన మూడేళ్ల బాబు హర్షవర్ధన్ తప్పిపోయాడు వెంటనే పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు వెతికి పట్టుకొని బాబును తల్లిదండ్రులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గజ్వేల్‌రూరల్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన శ్రీగిరిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పొట్ట ఆనంద్(39)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆనంద్ మద్యానికి బానిస కావడంతో కుటుంబంలో కలహాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో గత నెల 29న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం ఆర్‌వీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి..



మెదక్ మున్సిపాలిటీ: ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. మెదక్ పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో 35ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటంతో పోలీసులు అతన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచినట్లు తెలిపారు. మృతుడి ఛాతీపైన అమ్మ నాన్న అంటూ లవ్ సింబల్‌లో పచ్చబొట్టు ఉంది. తెల్లని బనియన్ ధరించి ఉన్నాడు. ఎవరైనా ఇతడిని గుర్తు పట్టినా.. లేదా కుటుంబ సభ్యులు ఫోన్ నంబర్లు 87126 57913, 87126 57914కు సంప్రదించాలని పోలీసులు కోరారు.

62 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు

సిద్దిపేటకమాన్: కమిషనరేట్ పరిధిలో ఆదివారం రాత్రి పోలీసులు స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 62 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు సీపీ అనురాధ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇళ్లు, రహదారులకూ రైతు భరోసా!

- పేదలకు కోతలు, పెద్దల మేడలకు భరోసా
- సాగు భూముల సర్వేలో అధికారుల విఫలం
- క్లస్టర్ పరిధిలో లెక్కలు తెలపని ఏఈఓలు
- తోటపల్లిలోనే 30 ఎకరాలకు వృథా

రైతు భరోసా నిధులు దుర్వినియోగం కాకూడదనే లక్ష్యంతో సాగుకు యోగ్యంకాని భూములను గుర్తించడానికి ప్రభుత్వం సర్వే చేయించింది. అధికారులు మాత్రం గ్రామాల్లో ఒక దగ్గర కూర్చొని తప్పుడు సర్వేచేసి మండలంలో 1180 ఎకరాలు సాగుకు యోగ్యంకాని భూములు ఉన్నట్లు నివేదికలు రూపొందించారు.

– హుస్నాబాద్‌రూరల్:


రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన సిమెంట్ బ్రిక్స్ పరిశ్రమ


తోటపల్లిలో సర్వే నంబరు 153లో నిర్మించిన ఇల్లు

చిన్న, సన్నకారు రైతులకు ఒక్కొక్క సర్వే నంబరులో 0.5 నుంచి 10 గుంటల వరకు ఉన్న భూములకు రైతు భరోసాలో కోత విధించారు. బడా బాబులు వ్యవసాయ భూమిలో 10 గుంటల విస్తీరణంలో ఇల్లు నిర్మించినా వారికి రైతు భరోసా ఇవ్వడంపై పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా అధికారులు సర్వేచేసి ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా నిధులు దుర్వినియోగానికి కారకులవుతున్నారు. హుస్నాబాద్ మండలంలోని 17 పంచాయతీల్లో సర్వే చేసిన అధికారులు 1180 ఎకరాల భూమిని సాగుకు యోగ్యం కానిదిగా గుర్తించారు. ప్రభుత్వం మొదట మండలానికి ఒక గ్రామాన్ని ఎంపికచేసి నాలుగు సంక్షేమ పథకాలను వందశాతం అమలుచేయాలని నిర్ణయం తీసుకుంది. హుస్నాబాద్ మండలంలో తోటపల్లి గ్రామాన్ని ఎంపికచేసి జనవరి 26న అధికారులు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలకు లబ్ధిదారుల జాబితాలను ప్రకటించి మంజూరు పత్రాలను అందించారు. మరుసటి రోజు రెవెన్యూ గ్రామ పరిధిలోని తోటపల్లి, గాంధీనగర్, పూసలపల్లె, కిషన్‌నగర్ రైతులకు ప్రభుత్వం రైతు భరోసా డబ్బులను జమచేసింది. తోటపల్లి రెవెన్యూ గ్రామంలో 2కి.మీల పొడవునా వివిధ సర్వే నంబర్ల నుంచి ఆర్ అండ్ బీ రోడ్డు వెళుతోంది. దాదాపు ఆరు ఎకరాల వరకు రోడ్డు రైతుల పట్టాలోనే ఉంది. గ్రామాల్లోని నివాసాలు ఏర్పాటు చేసుకున్న భూములు కూడా ఇతర రైతుల పేరున ఉంది. గతంలో రైతు బంధు తీసుకున్నా ఇప్పుడు అదే పరిస్థితి నెలకొంది. రహదారికి పక్కనే పరిశ్రమలను ఏర్పాటు చేసిన భూములకు సైతం అధికారులు రైతు భరోసా ఇచ్చారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సన్న, చిన్నకారు రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమకు పశువుల పాకలను నిర్మాణం చేసుకున్న భూములను అధికారులు తొలగించారు. పెద్ద భూస్వాములు, రిటైర్డు ఉద్యోగులు వ్యవసాయ భూమిలో 0–20 గుంటల విస్తీర్ణంలో నివాసాలు నిర్మించిన వాటిని తొలగించలేదు. తోటపల్లి రెవెన్యూ పరిధిలో దాదాపు 30 ఎకరాల వరకు సాగుకు యోగ్యంకాని భూములకు రైతు భరోసా ఇవ్వడంతో రూ.1.80 లక్షల ప్రభుత్వ నిధులు వృథా కావడానికి వ్యవసాయ అధికారులే కారణమని రైతులు ఆరోపిస్తున్నారు.

ఉమ్మాపూర్ రెవెన్యూ పరిధిలో వందల ఎకరాల్లో గుట్టలు

హుస్నాబాద్ మండలంలోని ఉమ్మాపూర్, పోతారం(ఎస్), నాగారం, మీర్జాపూర్ గ్రామాల్లో వందల ఎకరాల భూముల్లో గుట్టలు ఉన్నా గతంలో రెవెన్యూ అధికారులు ఇష్టారీతిగా అసైన్డ్ పట్టాలు ఇచ్చారు. గుట్టలకు పట్టాలు ఎవరు ఇచ్చారని రెవెన్యూ అధికారులే విస్మయం వ్యక్తం చేసినా ఇప్పుడు సాగుకు యోగ్యం కాని భూముల్లో ఇక్కడి గుట్టల భూములు చాలా వరకు లేవు, ఇటుక బట్టీలు, సిమెంట్ బ్రిక్స్ పరిశ్రమలు, పోతారంలో ఏర్పాటు చేసి అనుమతి లేని లే ఔట్ భూములు కూడా రైతు భరోసా అర్హుల జాబితాలో ఉన్నట్లు ఆయా గ్రామాల రైతులు చెప్తున్నారు. రోడ్లు, భవనాలు, పరిశ్రమలు, గుట్టల భూములను అధికారులు గుర్తించి రైతు భరోసా జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

వ్యవసాయ భూముల్లో ఇళ్లు



వ్యవసాయ భూముల్లో చాలా మంది 10 నుంచి 20 గుంటల విస్తీరణంలో ఇళ్లు నిర్మించినా ఒకే సర్వే నంబరులో ఉండటం వల్ల వాటిని తొలగించలేదు. 2 గుంటలు, 4 గుంటలు ఉన్న చిన్న నంబర్లను తొలగించినా రైతులు సాగు భూములని చెప్పారు. మళ్లీ నమోదు చేయడానికి సైట్ క్లోజ్ కావడంతో చిన్న రైతులకు నష్టం జరిగింది. మరో పంటకు అవకాశం ఉంటే నమోదు చేస్తాం. వ్యవసాయ భూముల్లో ఇళ్ల నిర్మాణం కింద ఉన్న భూములను కలెక్టర్ ఆదేశాల మేరకు తొలగిస్తాం.

– నాగరాజు, మండల వ్యవసాయ అధికారి, హుస్నాబాద్

రైతులకు విజ్ఞప్తి మేరకు..



వ్యవసాయ అధికారుల సహకారంతోనే సాగుకు యోగ్యంకాని భూములను గుర్తించినా కొందరు వాటిని సాగు భూములని చెప్పడంతో దరఖాస్తులు తీసుకుంటున్నాం. క్లస్టర్‌వారీగా వ్యవసాయ అధికారులు సాగు భూములను నమోదు చేసుకొంటే అనర్హులను తొలగించడం సులభంగా ఉంటుంది. ఏఈఓల దగ్గర సాగు భూముల వివరాలు లేనప్పుడు అర్హులకు అన్యాయం జరుగుతుంది.

– రవీందర్‌రెడ్డి, తహసీల్దారు, హుస్నాబాద్

వలంటీర్ల సేవలు మరువలేనివి



సమావేశంలో మాట్లాడుతున్న చుక్కా రాములు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రం సంగారెడ్డిలో జరిగిన సీపీఎం 4వ రాష్ట్ర మహాసభల విజయవంతానికి వలంటీర్లు చేసిన సేవలు మరువలేనివని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు పేర్కొన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆదివారం జరిగిన వలంటీర్లకు కృతజ్ఞతల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర మహాసభలు జయప్రదం కావడంలో జిల్లా ప్రజానీకంతోపాటు కార్మికులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు విరాళాలు అందించి ఇతోధికంగా సహాయ సహకారాలు అందజేశారని తెలిపారు. పార్టీ తరఫున భవిష్యత్ పోరాటాలకు సంగారెడ్డి మహాసభలు వేదిక కావడం మంచిపరిణామమని చెప్పారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలకు ప్రజలు కలసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు అడివయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య, సాయిలు, మాణిక్యం, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తల్లి, కుమారుడి అదృశ్యం

- వారం క్రితం మరొకరు..
- మిస్టరీపై గ్రామస్తుల అనుమానాలు


యాదమ్మ


రుత్విక్

రామాయంపేట(మెదక్): మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో తల్లీ, కుమారుడు అదృశ్యమయ్యారు. ఎస్ఐ బాలరాజు కథనం మేరకు.. గ్రామానికి చెందిన అనుముల యాదమ్మ (30), ఆమె కుమారుడు రుత్విక్ (10) గత నెల 29న ఇంటి నుంచి వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులు వారిద్దరి ఆచూకీ కోసం ఎంత ప్రయత్నించినా ఫలితం లేదు. దీంతో యాదమ్మ తల్లి బాగవ్వ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా వారం క్రితం అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి అదృశ్యం కాగా, వీరి ముగ్గురి అదృశ్యం వెనుక మిస్టరీ ఉందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి


స్వామి (ఫైల్)

రామాయంపేట(మెదక్): రామాయంపేట పట్టణ శివారులో ఆదివారం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన పోచమ్మల స్వామి (55) బైక్‌పై రామాయంపేట వైపు వస్తుండగా, ఎదురుగా వస్తున్న మరో వ్యక్తి తన బైక్‌ను కుడివైపున ఉన్న పెట్రోల్ పంపు వైపు మలుపుతున్న క్రమంలో రెండు బైక్‌లు బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన స్వామిని చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందాడు. కాగా గాయపడిన మరొకర వ్యక్తి వివరాలు తెలియరాలేదని ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు ప్రమాదంలో..

నర్సాపూర్ రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన నర్సాపూర్- వెల్దుర్తి రహదారిలో చోటుచేసుకుంది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట మండలం టిక్యాతండాకు చెందిన నేనావత్ ఆంజనేయులు (42) నర్సాపూర్ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్ జరుగుతున్న బంధువుల పెళ్లికి హాజరయ్యేందుకు బైక్‌పై బయలుదేరాడు. మరికొన్ని నిమిషాల్లో పెళ్లి మండపానికి చేరుకునే వాడు. అయితే ఫంక్షన్‌హాల్ సమీపంలో ఎదురుగా వచ్చిన బోర్ డ్రిల్లింగ్ వాహనం ఢీకొట్టింది. దీంతో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడే ఉన్న భార్య లలిత, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


ఆంజనేయులు (ఫైల్)

డివైడర్‌ను ఢీకొని..

దుబ్బాకరూరల్: ఎదురుగా వచ్చిన పందిని ఢీకొట్టి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలం పోతారెడ్డిపేట వద్ద చోటు చేసుకుంది. ఎస్ఐ హరీశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాచకొండ యాదగిరి శనివారం రాత్రి ఎనిమిది గంటలకు తన కుటుంబ సభ్యులతో బైక్‌పై కూడవెల్లి జాతరకు వెళ్లాడు. భార్య, పిల్లలను జాతరలో వదిలి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో పోతారెడ్డిపేట సబ్ స్టేషన్ వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన పందిని తప్పించే క్రమంలో డివైడర్‌ను ఢీకొట్టాడు. అతడిని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తైబజార్ వసూలు దారులపై దాడి

పలువురిపై కేసు నమోదు

దుబ్బాకటౌన్: గొర్రెలు, మేకల సంతలో తై బజార్ వసూలుచేసే ముగ్గురు కూలీలపై దాడిచేసిన వ్యాపారులపై కేసు నమోదు చేసిన ఘటన దుబ్బాకలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ వి.గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మాల కుంటలో ప్రతి శనివారం సంత నిర్వహిస్తారు. ఈ క్రమంలో శనివారం రుసుము వసూలు చేస్తున్న క్రమంలో కూలీలు శ్రీధర్, రాకేశ్, గోపీలపై వ్యాపారులైన పర్వతాలు, ధారబోయిన ఉప్పలయ్య, రాజల్లుతో పాటు మరి కొంత మంది దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు కూలీలకు గాయాలయ్యాయి. గాయపడ్డ శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి దారుణహత్య


మృతదేహం వద్ద ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

శివ్వంపేట(నర్సాపూర్): వ్యక్తి దారుణహత్యకు గురైన సంఘటన మండల పరిధిలోని టిక్యా దేవమ్మగూడెం పంచాయతీ పరిధి సామ్య తండాలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన మదన్‌లాల్‌నాయక్ (38) ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. అదివారం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో గుర్తించిన తండా వాసులు లోనికి వెళ్లి చూడగా మదన్‌లాల్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో పొడిచి హత్యచేశారని.. ఇది తెలిసిన వారి పనేనని మృతుడి బంధువులు ఆరోపించారు. మదన్‌లాల్ తండ్రి హీరాలాల్ మూడేళ్ల క్రితం, తల్లి రాజమణి ఏడాది క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. ఇంట్లో గొడవలు చోటుచేసుకోవడంతో మూడేళ్ల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మదన్‌లాల్ వ్యవసాయం చేసుకుంటూ ఒక్కడే తండాలో ఉంటున్నాడు. సంఘటనా స్థలాన్ని తూప్రాన్ సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ మధుకర్‌రెడ్డి, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందం పరిశీలించి ఆధారాలు సేకరించారు. హత్యకు పాల్పడిన వారిని త్వరలోనే గుర్తించి పట్టుకుంటామని సీఐ తెలిపారు.

భగ్న ప్రేమికుడి బలవన్మరణం


ప్రశాంత్ (ఫైల్)

కొండపాక(గజ్వేల్): ఓ భగ్న ప్రేమికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కొండపాకలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ప్రశాంత్(29) బీఈడీ పూర్తి చేసి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. శనివారం రాత్రి బయటకు వెళ్తున్నానని తండ్రి ఎల్లయ్యకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం తమ వ్యవసాయ పొలం వద్ద పాలు పితికేందుకు వెళ్లిన ఎల్లయ్యకు సమీపంలోని చింతచెట్టుకు ప్రశాంత్ వేలాడుతూ విగతజీవిగా కనిపించడాన్ని చూసి కంగుతున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. అనంతరం సెల్‌ఫోన్‌ను పరిశీలించగా.. ప్రేమించిన అమ్మాయి దక్కలేదని మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లుగా తాము భావిస్తున్నామని ఎల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రశాంత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని నర్రెగూడెంలో నివాసం ఉండే ఉపేందర్ ఎనిమిది సంవత్సరాల క్రితం ఖమ్మంకు చెందిన మౌనికను వివాహం చేసుకున్నాడు. వివాహం జరిగిన కొద్ది రోజుల నుంచే గొడవలు జరుగుతూ ఉండేవి. ఈ క్రమంలో మౌనిక మూడు సంవత్సరాల క్రితం భర్త ఉపేందర్‌ను వదిలేసి తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. వెళ్లి అక్కడ పోలీస్‌స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేసింది. అయితే ఒంటరిగా ఉన్న ఉపేందర్ జనవరి 21న జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజ్ఞాపూర్‌లో..

గజ్వేల్‌రూరల్: పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగులపల్లి సంతోష్ (35) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుకునూర్‌పల్లికి ఇల్లరికం వెళ్లిన సంతోష్ ఏ పనిచేయకుండా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ కలహాలతో శనివారం రాత్రి ప్రజ్ఞాపూర్ వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రాత్రి మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ పోలీసులు తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్లి.. అనంతలోకాలకు


మల్లేశం (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): బంధువు అంత్యక్రియలకు వెళ్లిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన నార్సింగి మండలం శేరిపల్లిలో విషాదం నింపింది. గ్రామానికి చెందిన చెన్నగారి మల్లేశం (46) కామారెడ్డి పట్టణంలో బంధువు మృతి చెందడంతో శనివారం వెళ్లాడు. అంత్యక్రియలు ముగిసిన అనంతరం రాత్రి సమయంలో బైక్‌పై ఇంటికి బయలుదేరగా దేవునిపల్లి రహదారిపై ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పట్టపగలే బైక్ చోరీ

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం ఊట్ల శివారులో పార్కు చేసిన బైక్ చోరీకి గురైంది. గ్రామానికి చెందిన ఆంజనేయులు ఆదివారం ఉదయం తన షాపు వద్ద పార్కు చేశాడు. ఉదయం 11 గంటల సమయంలో బైక్ చోరీకి గురైంది. దీంతో పోలీసులను ఆశ్రయించాడు. సీసీ కెమెరాలు పరిశీలించగా.. జంగంపేట వైపు ఓవ్యక్తి బైక్ తీసుకెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి.

భక్తుల కొంగుబంగారం

4 నుంచి మహంకాళి దేవి ఆలయంలో ఉత్సవాలు

ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు ● పెద్ద ఎత్తున హాజరుకానున్న భక్తులు

మహంకాళిమాత ఆలయం




ఆలయంలో కొలువై ఉన్న మహంకాళమ్మ

దుబ్బాక: భక్తులకు వరాలిచ్చే మహిమగల దేవతగా దుబ్బాక పట్టణంలో కొలువైన మహంకాళమ్మ ప్రసిద్ధి. పట్టణంలోని చీకోడ్ వెళ్లే బైపాస్ రోడ్డులో గత ఎనిమిదేళ్ల క్రితం మహంకాళమ్మ ఆలయాన్ని అన్ని హంగులతో అద్భుతంగా నిర్మించారు. అనతికాలంలోనే ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువైంది. ఆలయం ఎనిమిదవ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

రేపటి నుంచి ఉత్సవాలు

గ్రామ దేవతగా కొలుచుకుంటున్న మహంకాళి ఆలయంలో ఎనిమిదో వార్షికోత్సవాలు మంగళవారం ప్రారంభం అవుతాయి. పట్టణంలోని రెడ్డి, మున్నూరు కాపు సంఘాలతో పాటు ఇతర భక్తులు ఉత్సవాలు నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం 8 గంటలకు ఆలయంలో మహంకాళమ్మకు మహాభిషేకం అలంకరణతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. ఈ సందర్భంగా ముందుగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, అమ్మవారికి పంచామృతాభిషేకము, అలంకరణ, ఉదయం 9 గంటల నుంచి సువాసినిలచే సామూహిక కుంకుమార్చన, అమ్మవారి మూలమంత్ర హవనం, పూర్ణాహుతి, మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ, అన్నదానం కార్యక్రమాలు ఉంటాయి. కాగా, ఉత్సవాల సందర్భంగా గురుమాధవానంద సరస్వతి స్వామిజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తారు.

ప్రముఖుల రాక

ఉత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వేదపండితులు వేలేటి జయరామశర్మ, రామకృష్ణ శర్మల ఆధ్వర్యంలో వైదిక నిర్వహణ జరుగుతుంది. ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో తగు ఏర్పాట్లు చేశారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



మహంకాళమ్మ ఉత్సవాల సందర్భంగా ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా అన్ని ఏర్పాట్లు చేశాం.

–గన్నె బుచ్చిరాజంరెడ్డి, ఆలయ కమిటీ బాధ్యులు